క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

నడిగూడెం : సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 2023- 24 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతిలో ప్రవేశాలకు ఈ నెల 16న దరఖాస్తు చేసుకోవాలని స్థానిక బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్.ధనవిజయలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 23న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

ఆలయానికి వెండి బహూకరణ



వెండి అందజేస్తున్న దాతలు

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీ కనకదుర్గ ఆలయంలో ప్రతిష్ఠ వార్షికోత్సవం రోజును మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పంచామృత అభిషేకం, కుంకుమ పూజ, నివేదన, మంగళ నీరాజన మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వినియోగం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం బి.వెంకటప్పయ్య జ్ఞాపకార్థం ఆయన సతీమణి వెంకటలక్ష్మి నాగావళి 500 గ్రాముల వెండి, కన్నెగుండ్ల సీతారామరావు సీతామహాలక్ష్మి 500 గ్రాముల వెండిని అమ్మవారికి బహూకరించారు. కార్యక్రమంలో పూజారులు, భక్తులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న శాలివాహన వెల్ఫేర్ సొసైటీ సభ్యులు

మునగాల : మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యానికి గురై మృతిచెందిన కొత్తపల్లి పద్మ కుటుంబానికి మునగాల శాలివాహన వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం రూ.20వేల ఆర్థికసాయాన్ని మృతురాలి భర్త కొత్తపల్లి వెంకటేశ్వర్లుకు అందజేశారు. ఈ సందర్భంగా శాలివాహన వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు సిరికొండ అంతయ్య మాట్లాడుతూ శాలివాహన కులంలో వెనుకబడిన వారిని ఆదుకునేందుకు తమ సొసైటీ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో ఆ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



పోలీస్ అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న నవీన్‌కుమార్

నేరేడుచర్ల : బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షిరాం జయంతి సందర్భంగా మంగళవారం నేరేడుచర్లలో మహిళా కానిస్టేబుల్, ఎస్‌ఐ అభ్యర్థులకు స్టడీ మెటీరియల్‌ను బీఎస్పీ సూర్యాపేట జిల్లా ఇన్‌చార్జ్ రాపోలు నవీన్‌కుమార్ అందజేశారు. కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు జిలకర వీరస్వామి, నాగార్జున, స్వరూప్‌రావు, వీర కృష్ణ తదితరులు ఉన్నారు.

చిరుమర్తిపై ఫిర్యాదు

పాలకవీడు : యావత్ మహిళా లోకం తలదించుకునేలా బీఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తల కుటుంబాలను ఉద్దేశించి నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మాట్లాడిన తీరును ఖండిస్తూ అతనిపై చర్యలు తీసుకోవాలని మంగళవారం పార్టీ నాయకులతో కలిసి పాలకవీడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కుందూరు మట్టారెడ్డి, సురేష్, వెంకన్న, సైదులు, లాజరు పాల్గొన్నారు.

ఎంబీసీ లిఫ్ట్ పనులు నిలిపివేయాలి

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : రైతులకు నష్టం కలిగించే ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ (ఎంబీసీ) లిఫ్ట్ పనులు నిలిపివేయాలని తెలంగాణ జన సమితి నియోజకవర్గ ఇన్‌చార్జ్ దొంతిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం చింతలపాలెం మండలంలోని పాత వెల్లటూరు లిఫ్ట్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వద్దంటున్న లిఫ్ట్ పనులు ఎవరి కోసం చేస్తున్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో రైతులు లక్ష్మారెడ్డి, వెంకటరెడ్డి, జగన్ మోహన్‌రెడ్డి, మాధవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

హుజూర్‌నగర్‌రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కంటి వెలుగు పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కరక్కాయలగూడెంలో కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ కీత జయమ్మధనమూర్తితో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. కంటి వెలుగు శిబిరంలో అవసరమైన వారికి వెంటనే అద్దాలు ఇస్తారని, శస్త్ర చికిత్స అవసరమైన వారిని రిఫర్ చేస్తారని తెలిపారు. కంటి వెలుగు పథకం దేశానికే ఆదర్శంగా నిలిచిందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మచ్చా వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ చింతకుంట్ల కల్పన, కార్యదర్శి సతీష్, కీత కృష్ణమోహన్, అప్పారావు, వార్డు సభ్యులు, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మత్స్య సొసైటీ ఎన్నిక ఏకగ్రీవం

- పోలీసుల భారీ బందోబస్తు
- సొసైటీలో సద్దుమణిగిన వివాదం



అనంతు గుర్వయ్య, అధ్యక్షుడు



బుర్రి బాబు, ప్రధాన కార్యదర్శి



కలకోవలో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు



ఎన్నికలో పాల్గొన్న మత్స్య సంఘం సభ్యులు

మునగాల : మండలంలోని కలకోవ గ్రామంలో గత ఏడాదిన్నర కాలంగా నిలిచిన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పాలకవర్గం ఎన్నికలు మొత్తానికి మంగళవారం జరిగాయి. పలు వివాదాల నడుమ మూడుసార్లు వాయిదా పడిన ఎన్నికలు భారీ పోలీసు బందోబస్తు నడుమ ప్రశాంతంగా ముగిశాయి. గత ఇరవై ఏళ్లుగా సీపీఎం పార్టీ ఆధీనంలో ఉన్న సంఘాన్ని అధికార పార్టీ కైవసం చేసుకోవాలనే ఉద్దేశంతో ఉండడంతో పలు కారణాల వల్ల వాయిదా పడుతూ వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆ సంఘం మాజీ అధ్యక్షుడు బుర్రి శ్రీరాములు హైకోర్టును ఆశ్రయించాడు. దీంతో ఈనెల 5న సంఘానికి ఎన్నిక జరగాల్సి ఉండగా ఎన్నికల అధికారి సకాలంలో హాజరు కాకపోవడంతో మూడవసారి సంఘం ఎన్నికలు వాయిదా పడ్డాయి.

తొమ్మిది మంది సభ్యులతో కమిటీ..

జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో జరిగిన కలకోవ మత్స్య సొసైటీ ఎన్నికల్లో జిల్లా కోఆపరేటీవ్‌కు చెందిన నాగేశ్వరరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. కాగా 40 మంది సభ్యులు గల కలకోవ మత్స్య పారిశ్రామిక సహకార సంఘంలో ఇద్దరు వ్యక్తులు మృతిచెందగా, ఐదుగురు అధికార పార్టీకి చెందిన సభ్యులు ఈ ఎన్నికకు గైర్హాజరయ్యారు. మరో ఇద్దరు సభ్యులు అనారోగ్య కారణాలతో ఓటింగ్‌కు హాజరు కాలేదు. మిగిలిన 33 మంది సభ్యులు ఎన్నికలలో పాల్గొన్నారు. సంఘంలో 9 మంది డైరెక్టర్ పదవులకు తొమ్మిది మంది నామినేషన్ దాఖలు చేయడంతో పాలకవర్గం ఎన్నిక ఏకగ్రీవం అయినట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. అనంతరం ఎన్నికైన డైరెక్టర్లు సంఘం అధ్యక్షుడిగా మాజీ అధ్యక్షుడు అనంతు గుర్వయ్యను అధ్యక్షుడిగా, బుర్రి బాబును ప్రధాన కార్యదర్శిగా, పాతకొట్ల లింగయ్యను ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. డైరెక్టర్లుగా మండవ వెంకటేశ్వర్లు, కొంపెల్లి లింగయ్య, కొంపెల్లి అయ్యన్న, పనస సింహాద్రి, సాల పద్మ, సురబి సైదమ్మలు ఎన్నికయ్యారు.

డీఎస్పీ ఆధ్వర్యంలో బందోబస్తు

కాగా, ఈ ఎన్నికలకు కోదాడ డీఎస్పీ జి.వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఐదుగురు సీఐలు, 12 మంది ఎస్‌ఐలు, 100 మంది పోలీసు సిబ్బంది భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. దీంతో ఎన్నిక ప్రశాంతంగా జరగడంతో అటు పోలీసులు, ఇటు గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్



బొడ్రాయికి అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

కోదాడఅర్బన్ : సంస్కృతి, సంప్రదాయాలను కాపాడి భావితరాలను అందించాలని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. కోదాడ పట్టణంలో బొడ్రాయి పంచమ వార్షికోత్సవాన్ని మంగళవారం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారికి జలాభిషేకం చేశారు. భక్తులు తెల్లవారు జాము నుంచే బొడ్రాయి వద్దకు చేరుకుని రాగి బిందెలతో అమ్మవారికి జలాభిషేకం చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి బోనాలు సమర్పించారు. అలాగే మున్సిపల్ చైర్ పర్సన్ వనపర్తి శిరీషాలక్ష్మీనారాయణ దంపతులు, మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, ఎంపీపీ చింతా కవితారాధారెడ్డిలు వేర్వేరుగా పాల్గొని అమ్మవారికి జలాభిషేకాలు చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, పీఏసీఎస్ చైర్మన్ ఆవుల రామారావు, మున్సిపల్ వైస్ చెర్‌పర్సన్ వెంపటి పద్మ, వెంకటనారాయణ, పయిడిమర్రి సత్యబాబు, నీలా సత్యనారాయణ, రామినేని శ్రీనివాసరావు, చందు నాగేశ్వరరావు, పుల్లయ్య, నాగయ్య, మురళి తదితరులు పాల్గొన్నారు.

వారం రోజుల్లో జర్నలిస్టులకు ఇళ్ల పట్టాలు

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

హుజూర్‌నగర్ : జర్నలిస్టులకు వారం రోజుల్లో ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తామని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. మంగళవారం వర్కింగ్ జర్నలిస్టుల సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉన్నతాధికారులతో మాట్లాడి జర్నలిస్టులకు వారం రోజుల్లో ఇళ్ల పట్టాలు పంపిణీ చేసేలా చూస్తామని చెప్పారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొలా నాగేశ్వరరావు, స్థానిక విలేకరులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలో గ్రామాలకు మహర్దశ

మేళ్లచెరువు : బీఆర్ఎస్ పాలనలో గ్రామాలకు మహర్దశ వచ్చిందని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని రామాపురం గ్రామంలో రూ. 25 లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. కార్యక్రమంలో సూరిశెట్టి భసవయ్య, మల్లికార్జున్, నర్సింహారావు తదితరులున్నారు.

రోడ్డు పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు

- ఆర్‌అండ్‌బీ ఈఈ యాకూబ్

సాక్షి ఎఫెక్ట్..



రోడ్డు నిర్మాణంలో నాణ్యతను పరిశీలిస్తున్న ఆర్‌అండ్‌బీ అధికారులు

మునగాల : మండలంలోని కొక్కిరేణి -తిమ్మారెడ్డిగూడెం గ్రామాల మధ్య చేపట్టిన డబుల్ రోడ్డు నిర్మాణ పనుల్లో లోపించిన నాణ్యతపై ఈనెల 13న సాక్షి దినపత్రికలో 'రోడ్డు పనుల్లో లోపించిన నాణ్యత' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించారు. మంగళవారం ఆర్‌అండ్‌బీ ఈఈ యాకూబ్, డీఈ పవణ్‌కుమార్, ఏఈ బి.సత్యనారాయణలు డబుల్ రోడ్డు నిర్మాణ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిర్మాణ పనులకు సంబంధించి గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ రోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని, నిర్మాణ పనులను తమ శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారన్నారు. నిర్మాణపు పనులు వేగవంతం చేసేందుకు సంబంధిత కాంట్రాక్టర్‌కు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత లోపించిందని, పర్యవేక్షణ కొరవడిందని పలువురు చేసిన ఆరోపణలలో వాస్తవం లేదన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

నేరేడుచర్ల : మండలంలోని బురుగులతండా గ్రామంలో ఉపాధి హామీ పనులను మంగళవారం ఎంపీడీఓ శంకరయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డులు ఉన్న ప్రతి ఒక్కరికి పనులు కల్పించాలన్నారు. ప్రతి రోజు కూలీల హాజరు పట్టికలో పేర్లు నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ రజిత తదితరులున్నారు.

అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేయాలి

మఠంపల్లి : మండలంలోని వివిధ గ్రామ పంచాయతీలలో చేపడుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఎంపీఓ ఆంజనేయులు కోరారు. మంగళవారం మండలంలోని అల్లీపురంలో గ్రామపంచాయతీ రికార్డులు తనిఖీ చేసి, పన్నుల వసూళ్లు పూర్తిచేయాలని ఆదేశించారు. అదే విధంగా కొత్తదొనబండతండాలోని నర్సరీని పరిశీలించి మొక్కలు ఏపుగా పెరిగేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు నరేందర్‌రెడ్డి, రాజు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

నేటి నుంచి ఒక్కపూట బడులు

మోతె : తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు నేటి నుంచి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ఒక్కపూట బడులు నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి కె.గోపాల్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30ల వరకు పాఠశాల నిర్వహణ ఉంటుందన్నారు.

ఇంటర్మీడియట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



కోదాడఅర్బన్ : కేఆర్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

కోదాడఅర్బన్ : ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు కోదాడ పట్టణంలో ఏడు సెంటర్‌లు సిద్ధం చేశారు. మంగళవారం హాల్ టికెట్ నెంబర్ల వారీగా సీట్లు కేటాయించారు. పట్టణంలోని శ్రీవిద్య, సుగుణ, కేఆర్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, వాగ్దేవి, శ్రీవాగ్దేవి, ఎంఎస్ కళాశాల, ఎస్వీ జూనియర్ కళాశాలలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు.

నేరేడుచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

నేరేడుచర్ల : నేరేడుచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షల నిర్వహణకు మంగళవారం తరగతి గదుల్లోని టేబుళ్లపై హాల్ టికెట్ నెంబర్లు వేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మయ్య మాట్లాడుతూ 274 మంది విద్యార్థులు ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పరీక్షల చిప్ సుపరింటిండెంట్ ఎం.మాధవి, డీఓ నిరంజన్‌రెడ్డి సిబ్బంది ఉన్నారు.

అవినీతికి కేరాఫ్ కేసీఆర్ కుటుంబం

- వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు జిల్లేపల్లి వెంకటేశ్వర్లు



రాంరెడ్డికి నియామకపత్రం అందజేస్తున్న జిల్లేపల్లి

గరిడేపల్లి : అవినీతికి కేరాఫ్ సీఎం కేసీఆర్ కుటుంబమని వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు జిల్లేపల్లి వెంకటేశ్వర్లు ఆరోపించారు. మంగళవారం గరిడేపల్లిలో జరిగిన మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో అవినీతి పెరిగిందని, కేసీఆర్ పాలనలో పేదలకు న్యాయం జరగలేదన్నారు. అవినీతితో సంపాదించిన డబ్బును కేసీఆర్ రానున్న ఎన్నికల్లో ఖర్చుపెట్టి మరోసారి అధికారంలోకి రావాలని చూస్తున్నారని విమర్శించారు. అనంతరం పార్టీ గరిడేపల్లి మండల అధ్యక్షుడిగా కొణతం రాంరెడ్డిని నియమిస్తూ నియమకపత్రం అందజేశారు. అదేవిధంగా లక్ష్మీపురం గ్రామ అధ్యక్షుడిగా పుష్ప శ్రీనివాస్‌రెడ్డికి నియామక పత్రం అందజేశారు. సమావేశంలో ఆ పార్టీ జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి రామిశెట్టి మురళీప్రసాద్, హుజూర్‌నగర్ మండల అధ్యక్షుడు మర్రి రవీందర్‌రెడ్డి, నేరేడుచర్ల పట్టణ అధ్యక్షుడు ఉపేందర్ గౌడ్, గురువారావు, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నాని తదితరులు ఉన్నారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ



గరిడేపల్లి : ఎంపీపీఎస్ పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు



నేరేడుచర్ల : అంజలి స్కూల్‌లో విద్యాశాఖ మంత్రిగా సమస్యలు తెలుసుకుంటున్న విద్యార్థి



మునగాల : నేలమర్రిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో..

గరిడేపల్లి : మండలంలోని పొనుగోడు గ్రామంలో గల ఎంపీపీఎస్ పాఠశాలలో మంగళవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు.. అధికారులుగా, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, ఉపాధ్యాయులుగా వ్యవహరించి ఆకట్టుకున్నారు. ప్రధానోపాధ్యాయురాలు సువర్ణ, సర్పంచ్ జోగు సరోజనమ్మ, ఎస్‌ఎంసీ చైర్మన్ రేణుక, బత్తిని సూర్యం, ఉపాధ్యాయులు సత్యనారాయణ, సందీప్‌కుమార్, కోటేశ్వర్‌రావు, సుధాకర్, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

నేలమర్రిలోని ప్రభుత్వ పాఠశాలలో..

మునగాల : మండలంలోని నేలమర్రి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా విద్యార్థులు.. ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజాప్రతినిధుల వేషధారణలో అలరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మేడ నరేష్‌రెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ సికిందర్ , ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల : నేరేడుచర్లలోని అంజలి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో మంగళవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అలక సైదిరెడ్డి, డైరెక్టర్ సుంకరి క్రాంతికుమార్ అన్నారు.ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు ఉన్నారు.

రాంపురంలో..

మున్సిపాలిటీ పరిధిలోని రాంపురం ప్రాథమిక పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. హెచ్‌ఎం దిప్లానాయక్, ఉపాధ్యాయులు మాధవి, మాధురి, అంగన్‌వాడీ టీచర్ ప్రీతి ఉన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



కోదాడరూరల్ : రామలక్ష్మీపురంలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ కవిత

కోదాడరూరల్ : మండల పరిధిలోని రామలక్ష్మీపురంలో ఉపాధి హామీ నిధులు రూ.5 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఎంపీపీ చింత కవితారాధారెడ్డి ప్రారంభించారు. ఈ సందరర్భంగా ఆమె మాట్లాడుతూ విడతల వారీగా ప్రాధాన్యతను బట్టి అన్ని గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రెయినేజీలు నిర్మించుకుందామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పాముల మస్తాన్, ఉపసర్పంచ్ అన్నెం బుచ్చమ్మ, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు అన్నెం పెద్ద అంజిరెడ్డి, యూత్ అధ్యక్షుడు అన్నెం వెంకట్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు అంజిరెడ్డి తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే సహకారంతో గ్రామాలు అభివృద్ధి

పాలకవీడు : నియోజకవర్గ ఎమ్మెల్యే సైదిరెడ్డి సహకారంతో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కిష్టిపాటి అంజిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని నాగిరెడ్డిగూడెం గ్రామంలో ఎన్‌ఆర్‌జీఎస్ నిధులు రూ. 10 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు పనులను సర్పంచ్ మునగాల మాధవీసైదిరెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, వెంకట్‌రెడ్డి, నాగయ్య, మట్టారెడ్డి, ఇంద్రారెడ్డి వార్డుసభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గరిడేపల్లి : మండలంలోని అప్పన్నపేట గ్రామంలో ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిధులు రూ.8 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ యడవల్లి చంద్రారెడ్డి, ఎంపీటీసీ కడప ఇస్సాక్‌లు మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు బత్తిని వీరబాబు, నాగలక్ష్మి, నాగరాజు, రజిత, వినోద్, సౌజన్య, పంచాయతీ కార్యదర్శి శివకుమార్, స్థానికులు మధార్, నరేష్, శ్రీనివాస్, చిలకారెడ్డి తదితరులు ఉన్నారు.

కారల్ మార్క్స్‌కు నివాళి



కారల్‌మార్క్స్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

మునగాల : చరిత్ర గమనాన్ని మార్చివేసే సిద్ధాంతాన్ని రూపొందించిన మహా సిద్ధాంత కర్త కారల్ మార్క్స్ అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు తెలిపారు. కారల్ మార్క్స్ 131వ వర్ధంతి సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలోని అమరవీరుల స్మారక భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బెల్లంకొండ సత్యనారాయణ, చందా చంద్రయ్య, బచ్చలకూర స్వరాజ్యం, షేక్ సైదా, డి.స్టాలిన్‌రెడ్డి, బట్టు నాగయ్య, ఆరె.రామకృష్ణారెడ్డి, మామిడి గోపయ్య, మల్లారెడ్డి, పాల్గొన్నారు.

ఆర్టీసీ సంస్థను ప్రజలు ఆదరించాలి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ జయబాబు

నేరేడుచర్ల : ఆర్టీసీ సంస్థను ప్రజలు ఆదరించాలని మున్సిపల్ చైర్మన్ చందమళ్ల జయబాబు అన్నారు. మంగళవారం నేరేడుచర్లలో మిర్యాలగూడ ఆర్టీసీ డిపో మేనేజర్ బొల్లెద్దు పాల్ ఆధ్వర్యంలో 'ప్రజల వద్దకు ఆర్టీసీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరేడుచర్లలో డిపో మేనేజర్ గతంలో ప్రయాణికుల కోరిక మేరకు కాకినాడ, కోదాడ, విజయవాడ బస్సులను ఉదయం, సాయంత్రం వేళల్లో నిలుపుదల చేయించారన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది, స్థానికులు, ప్రయాణికులు తదితరులున్నారు.

క్షయరహిత సమాజాన్ని నిర్మిద్దాం



చిలుకూరు : మాట్లాడుతున్న ఎంపీపీ బండ్ల ప్రశాంతి కోటయ్య

అనంతగిరి : క్షయరహిత సమాజాన్ని నిర్మిద్దామని జిల్లా అసంక్రమిత వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఖానాపురంలో అనంతగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన టీబీ రహిత కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డా.రంజిత్‌రెడ్డి, సర్పంచ్ శ్రీనివాస్, సైదమ్మ, కృష్ణవేణి, ఉపేందర్, యాతాకుల మధుబాబు, ఉమారాణి, కళ్యాణి, సువార్త, తదితరులు పాల్గొన్నారు.

టీబీ నిర్మూలనకు కృషిచేయాలి

చిలుకూరు : టీబీ నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని ఎంపీపీ బండ్ల ప్రశాంతి కోటయ్య అన్నారు. మంగళవారం మండలంలోని బేతవోలు గ్రామంలో గల ఉప ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీబీ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీబీ నిర్మూలకు ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందని, రోగులకు ఉచితంగా మందులు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎమ్‌హెచ్‌ఓ నిరంజన్, సర్పంచ్ వట్టికూటి చంద్రకళ నాగయ్య, సీహెచ్‌ఓ వినోద్, సూపర్‌వైజర్ అంజయ్య, టీబీ సూపర్‌వైజర్ రాములు, కుమారి, నిర్మల, సుబ్బయ్య, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నివారణకు సహకరించాలి

మఠంపల్లి : మండలంలో క్షయవ్యాధి నివారణకు ప్రతిఒక్కరూ సహకరించాలని మండల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుధాకర్‌నాయక్ అన్నారు. మంగళవారం జాతీయ క్షయవ్యాధి నివారణ దినోత్సవంలో భాగంగా మండలంలోని పెదవీడులోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన క్షయవ్యాధి నిర్ధారణ శిబిరాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ సయ్యద్ బీబీకుతూబ్, ఎల్‌టీ రమేష్, ఏఎన్‌ఎం నిర్మల, కార్యదర్శి లక్ష్మణ్, ఆశలు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధిని నిర్లక్ష్యం చేయవద్దు

మునగాల : క్షయవ్యాధి పట్ల నిర్లక్ష్యం చేయవద్దని రేపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం టీబీ నోడల్ పర్సన్ లింగం రామకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని మాధవరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా నిక్షయ్ దివాస్ సందర్భంగా క్షయవ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడారు. టీబీ లక్షణాలు కనిపిస్తే వెంటనే పీహెచ్‌సీకి వచ్చి పరీక్ష చేయించుకోవాలన్నారు. కాగా రేపాల పీహెచ్‌సీ వైద్యాధికారి ఎల్లా శ్రీశైలం తన స్వంత ఖర్చులతో టీబీ వ్యాధిగ్రస్తులకు నిత్యావసర సరుకులు, బియ్యం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ ఆర్.వినోద, ల్యాబ్ టెక్నిషియన్ స్వాతి, ఏఎన్‌ఎంలు శాంతమ్మ, లలిత, హెల్త్ అసిస్టెంటు లింగయ్య, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీదుర్గామల్లికార్జునస్వామి కల్యాణం



స్వామివారి కల్యాణ మహోత్సవంలో తాళిబొట్టు చూపుతున్న వేదపండితులు

మునగాల : మండల కేంద్రంలోని శ్రీవెంకటకనకదుర్గ ఆలయంలో 11వ వార్షికోత్సవం మూడురోజులుగా వైభవంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా మంగళవారం శ్రీదుర్గామల్లికార్జునస్వామి కల్యాణ మహోత్సవాన్ని ఖమ్మంకు చెందిన ప్రసాద్ అవధాని ఆధ్వర్యంలో పురోహితులు శ్రీనివాసాచార్యులు, బుచ్చిరామయ్యశాస్త్రి, ప్రశాంత్‌చార్యులు కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ఎనిమిది జంటలు పీటలపై కూర్చున్నారు. ముందుగా పురోహితులు చండీయాగం నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రెండువేల మందికి అన్నదానం చేశారు. కల్యాణ మహోత్సవానికి వందలాది మంది భక్తులు హాజరై తిలకించారు.

టెంకాయలు, పూజా సామగ్రి విక్రయానికి నేడు వేలం

హుజూర్‌నగర్‌రరూరల్ : మండలంలోని గోపాలపురంలో ఉన్న శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో కొబ్బరికాయలు, పూలు, పూజా సామగ్రిని రెండు సంవత్సరాల పాటు విక్రయించేందుకు గాను దుకాణాల వేలం పాటను గురువారం మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించనున్నారు. వేలం పాటలో పాల్గొనదలిచిన వారు అదే రోజు మధ్యాహ్నం 12 గంటల లోపు రూ.30 వేలు డిపాజిట్ చేసి వేలం పాటలో పాల్గొనాలని ఆలయ కార్యనిర్వాహణాధికారి తుమ్మల వెంకట చలపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆత్మస్థైర్యంతో పరీక్షలకు హాజరుకావాలి

కోదాడరూరల్ : మండలంలోని కాపుగల్లులో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు అదే పాఠశాల 1995 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు మంగళవారం పరీక్ష సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి విద్యుత్ ఏఈ జిల్లా శంకర్ మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలపై భయం వీడి ఆత్మస్థైర్యంతో పరీక్షకు హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సుధాకర్, శ్రీనాథచారి, దేవరశెట్టి నాగేశ్వరరావు, లక్ష్మణరావు, శివయ్య, నరసింహారావు, శంభయ్య ఉన్నారు.

అన్నదాతలకు సన్మానం



చిలుకూరు : దాతలను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

చిలుకూరు : చిలుకూరు కాలువ ఒడ్డున గల అభయాంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కాగా అన్నదాన దాతలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దొడ్డా శ్రీను, ఆలయ కమిటీ సభ్యులు నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.